క్లుప్తంగా

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కడియం: వేమగిరి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఈఈ ఎస్.శామ్యూల్ తెలిపారు. వేమగిరి 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధి మురమండ, దుళ్ల, మాధవరాయుడు పాలెం, దామిరెడ్డిపల్లి, వీరవరం, పొట్టిలంక గ్రామాలకు విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేస్తామన్నారు. కడియం మండలం మురమండ సబ్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ బోర్లకు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బిక్కవోలు: విద్యుత్ మరమ్మతుల పనుల దృష్ట్యా మండలంలోని కొంకుదురు, పందలపాక గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఏఈ బుజ్జిదొర గురువారం తెలిపారు.

రంగంపేట: జి.దొంతమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని దొంతమూరు, బాలవరం గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

సాయిబాబాకు క్షీరాభిషేకం

మధురపూడి: బూరుగుపూడిలోని ద్వారకామయి బాబా మందిరంలో బాబాకు 73 లీటర్లలో పాలతో గురువారం అభిషేకం చేశారు. తొలుత బాబావారికి హారతులు ఇచ్చి పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. ఆలయ గురువు మామిడిపల్లి రామారావు, కమిటీ అధ్యక్షుడు కంటే నాగకేశవరావు, కంటే సత్యచక్ర గణపతి తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారి తీర్థం



కానేడులో మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామశివారు కానేడులో మహాలక్ష్మి అమ్మవారి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. విశేషంగా భక్తులు పాల్గొని అమ్మవారి దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన



సొసైటీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈఈ రఘురామ్

అనపర్తి: మండలంలోని కుతుకులూరులో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవన నిర్మాణ పనులను గురువారం అధికారులు పరిశీలించారు. భవన నిర్మాణ పనులను డీఈఈ జి.రఘురామ్ పరిశీలించి, నాణ్యతతో పనులు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ పడాల వెంకటరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, జేఈఈ కె.మురళికృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ దాసరి స్వామి, సీఈవో నూకరాజు తదితరులున్నారు.

575 మందికి వైద్య సేవలు



చినకొండేపూడిలో ఇంటి వద్ద రోగికి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: చినకొండేపూడిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 575 మందికి వైద్య సేవలందించారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించారు. అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. సూపర్‌వైజర్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎన్‌ఎం కృష్ణవేణి, ఆశ వర్కర్లు సునీల, పద్మ, లక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బళ్లమ్మ తల్లి తీర్థం

పెదపూడి: పెదపూడిలో కొలువైన బళ్లమ్మ తల్లి తీర్థం గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి తీర్థానికి మండల నలుమూల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు.

అచ్చొరే.. మత్స్యారే..

- ప్రభుత్వ చెరువుల్లో చేపల సాగు
- నియోజకవర్గంలో 32 మత్స్య సహకార సంఘాలు
- ఉపాధి పొందుతున్న 3 వేల కుటుంబాలు



జంభూపట్నం బలరామయ్య చెరువులో చేపల పట్టుబడి చేస్తున్న మత్స్య సహకార సంఘాల సభ్యులు

మధురపూడి: చేప చిక్కింది.. అనేక మందికి ఉపాధి వనరుగా మారుతోంది.. ప్రభుత్వం మత్స్య సంపద కల్పన ద్వారా మత్స్య సహకార సంఘాలకు బాసటగా నిలుస్తోంది.. రాజానగరం నియోజకవర్గంలో కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాలు ఉన్నాయి. వీటి పరిధి గ్రామాల్లో 1,727 ఎకరాల విస్తీర్ణంలో చెరువులు ఉన్నాయి. ఇందులో మైనర్ ఇరిగేషన్ చెరువులు 25, చిన్న చెరువులు 70 ఉన్నట్లు అధికారుల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో కొన్ని వ్యవసాయానికి ఆసరాగా నిలుస్తున్నాయి. చాలా చెరువులను మత్స్యకార సొసైటీలకు నామమాత్రపు రుసుముతో మత్స్యశాఖ ద్వారా అందిస్తున్నారు. నియోజకవర్గంలో 32 మత్స్య సహకార సంఘాలు ఈ చెరువులను నిర్వహిస్తున్నాయి. వీటి ద్వారా సుమారు 3 వేల కుటుంబాలకు చెందిన కార్మికులు ఉపాధి పొందుతున్నారు. వీరందరికీ చేపల పెంపకమే జీవనాధారం అయ్యింది. ఐదేళ్ల కిందట మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో ఏడాదికి 3 వేల టన్నులు మాత్రమే చేపల ఉత్పత్తి జరిగేది. మూడేళ్లుగా మత్స్య శాఖ ద్వారా పెంపకందారులకు శిక్షణ ఇస్తున్నారు. చేపల పెంపకానికి చెరువులను తీర్చిదిద్దడం, సాగులో మెలకువలు, పట్టుబడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆ ఉత్పత్తిని నిల్వ చేయడం, రవాణా, మార్కెటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తి అవగాహన కల్పించారు. దీంతో చేపల మార్కెటింగ్ పట్ల జాగ్రత్తలు పాటిస్తున్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలో చెరువుల నుంచి అత్యధికంగా 15 వేల టన్నుల చేపల ఉత్పత్తి జరిగింది.

మేలు రకం.. లాభాలు అధికం

ఈ చెరువుల్లో మేలు రకమైన చేపలను ఉత్పత్తి చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా బొచ్చు, రాగండి, ఎర్రమైల, గడ్డి, బంగారుతీగ, చెరువు చందువా, కొర్రమేను తదితర రకాలున్నాయి. వీటిని స్వయంగా పెంచడంతో తినడానికి చేపల ప్రియులు ఆసక్తి చూపుతున్నారు. వీటిని ఆది, మంగళ, గురువారాల్లో విక్రయిస్తుండడంతో ఆయా గ్రామాల్లోని దుకాణాల రద్దీ నెలకొంటుంది. కిలో చేపల ధర రూ.100 నుంచి రూ.130 పలుకుతోంది.

దిగుబడి పెరిగింది



రాజానగరం నియోజకవర్గంలో చెరువుల ద్వారా ఈ ఏడాది అత్యధికంగా 15 వేల టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతోంది. ఈ దిగుబడి గతం కంటే పెరిగింది. దీనిద్వారా రూ.15 లక్షల ఆదాయాన్ని ఆయా మత్స్య సహకార సంఘాలకు చెందిన సభ్యులు పొందుతున్నారు. చెరువుల నిర్వహణపై వారికి ఇచ్చిన ప్రత్యేక శిక్షణ సత్ఫలితాలను ఇస్తుంది. వారు పట్టణాల్లో సైతం చేపలను విక్రయించే స్థాయికి చేరారు.

–వి.కృష్ణారావు, జిల్లా మత్స్యశాఖాధికారి

ఉపాధి దొరుకుతుంది



చేపల పెంపకం ద్వారా గ్రామీణ ప్రాంత వాసులకు ఉపాధి దొరుకుతుంది. వేసవిలో వ్యవసాయ పనులుండవు. వీరికి చేపల పెంపకం ఉపాధి కల్పిస్తుంది. మేలు రకాలైన చేపలు పండిస్తుండడంతో స్థానికులు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవతో చెరువుల సంఖ్య పెరిగింది. మత్స్య దిగుబడి కూడా అధికమైంది.

–నాగా సత్తిబాబు, మాజీ సర్పంచ్, జంభూపట్నం

సురక్షిత నీటితో వ్యాధులు దూరం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: సురక్షితమైన తాగునీటిని తీసుకోవడం ద్వారా వివిధ రకాల వ్యాధులను దూరం చేసుకోవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గుంటూరుకు చెందిన మిషన్ రువా సౌజన్యంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా సుమారు 1300 మంది విద్యార్థులకు రక్షిత తాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రి దాసు, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం



గోకవరంలో వృద్ధుడికి ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తిరన్

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని డాక్టర్ తిరన్ అన్నారు. గోకవరం సచివాలయం–3 పరిధిలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహన వైద్యులు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్నవారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ లక్ష్మీకాంతం, వైద్య సిబ్బంది రమ్య, రమణ, శ్రీదేవి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రావిపాటి సేవా సంస్థ నిర్వాహకుడి మృతి

మధురపూడి: రావిపాటి స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు రావిపాటి శ్రీనివాసరావు (92) బుధవారం రాత్రి మృతి చెందారు. కోరుకొండ హైస్కూల్‌లో ఆయన పేద విద్యార్థులకు అనేక సేవలు అందించారు. పాఠశాలలో షెడ్ల నిర్మాణం, విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందజేత, తదితర సేవా కార్యక్రమాలను నిర్వహించారు. రావిపాటి మృతికి సేవా సంస్థ ప్రతినిధి కోలా సత్యనారాయణ, ఎంఈఓ కుశలవ దొర, స్థానికులు సంతాపం ప్రకటించారు. కోరుకొండ హైస్కూల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

దాడికి గురైన విద్యార్థికి పరామర్శ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీహరి సాయిప్రసాద్‌ను పరామర్శిస్తున్న విజయలక్ష్మి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజానగరం జిల్లా పరిషత్ హైస్కూల్లో తోటి విద్యార్థి చేతిలో దాడికి గురై స్థానికంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెంకే శ్రీహరి సాయిప్రసాద్‌ను వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి గురువారం పరామర్శించారు. తరగతి గదిలో సప్లమెంటరీ పరీక్ష రాస్తున్న శ్రీహరి సాయిప్రసాద్‌పై తొమ్మిదో తరగతి విద్యార్థి తనతో తెచ్చుకున్న చాకుతో అందరూ చూస్తుండగానే దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా జరిగిన సంఘటనపై ఆరా తీశారని, రాజా అందుబాటులో లేకపోవడంతో బాలుడికి జరుగుతున్న వైద్యం పరిశీలించేందుకు ఆసుపత్రికి వచ్చానని ఆయన తల్లి విజయలక్ష్మి తెలిపారు. బాలుడికి మెరుగైన వైద్యం అందించే దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు.

సత్వర న్యాయం అందేలా చూడాలి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



పెదపూడి పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పెదపూడి: గ్రామాల్లో పోలీసింగ్‌ను మరింత మెరుగుపరిచి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందేలా చూడాలని కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. పెదపూడి పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. శాంతి భద్రత చర్యలు, ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న మహిళా పోలీసుల సేవలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. వారి ద్వారా గ్రామాల నుంచి ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుని క్రైమ్ రేటుని తగ్గించే విధంగా ఒక ప్రణాళికతో పోలీసింగ్‌ను మెరుగుపరచాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో బళ్లమ్మ అమ్మవారి తీర్థం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వాసు, ఏఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్నివర్గాల సంక్షేమం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అచ్చుతాపురత్రయంలో గడప గడపకూ మన ప్రభుత్వం



అచ్చుతాపురత్రయంలో మహిళకు ప్రభుత్వ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అచ్చుతాపురత్రయంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఏ గడపకు వెళ్లినా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో తమ కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారంటూ ఆనందం, సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యులు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ అడబాల అనురాధ, ఎంపీటీసీ సభ్యురాలు పెండెం జ్ఞానప్రసూన, సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు, కర్రి సత్యనారాయణ, పార్టీ గ్రామ కన్వీనర్ పి.వీరన్న, కాకరపల్లి సుందరావు, అడబాల వెంకటరమణ, కోసూరి వాసు, కరెడ్ల కృష్ణార్జునరావు పాల్గొన్నారు.

దేశం గర్వించదగిన వ్యక్తి అంబేడ్కర్

అనపర్తి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఒక కులానికో, మతానికో చెందిన వ్యక్తి కాదని, భారతదేశం యావత్తు గర్వించదగిన ఒక మహత్తర శక్తి అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రాంగణంలో కళాశాలకు చెందిన 1991–1999 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పోరాడిన స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ పాటు పడాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, అనపర్తి, బిక్కవోలు మండలం కావపరం సర్పంచ్‌లు వారా కుమారి, సత్యంశెట్టి వెంకటమణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

సీతానగరం: నల్గొండకు చెందిన బొండ్రు నాగరాజును దూషించి, గాయపరిచినట్లు అందిన ఫిర్యాదుతో గుంటి వెంకటరత్నం, గుంటి మధులపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ టి.లోవకుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 19న రాత్రి 8 గంటలకు ఈ ఘటన జరిగిందన్నారు.

పేదరికమే ప్రామాణికంగా పథకాలు



సంక్షేమ పథకాలు వివరిస్తున్న గృహ సారథులు, నాయకులు

రంగంపేట: ఎవరి సిఫార్సులు అవసరం లేకుండా పేదరికమే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ అన్నారు. మండలంలోని కోటపాడు శివారు రామకృష్ణాపురంలో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలను సేకరించారు. గోడలపై జగనన్న స్టిక్కర్లు అతికించారు. అనంతరం బ్రోచర్లను అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుంకర అప్పారావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ గవరసాని రాజు, గుగ్గిల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బూరుగుపూడిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు

జగనన్న పాలనలోనే సంక్షేమం

మధురపూడి: సీఎం జగనన్న పాలనలోనే ప్రతి ఇంటికీ సంక్షేమం వచ్చిందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. స్థానిక కొత్తూరుతో కార్యక్రమం పూర్తయ్యింది. కోరుకొండ, దోసకాయలపల్లి, నర్సాపురం, నిడిగట్ల తదితర గ్రామాల్లోనూ కొనసాగింది. గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ తిరిగారు. జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లను ఇంటి గోడలకు అతికించారు. ప్రజా సర్వే చేశారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్‌తేజ, నాయకులు తోరాట శ్రీను, హరిబోలు చినబాబు, అయిల రామకృష్ణ పాల్గొన్నారు.

పథకాలతో పేదల ఇంట వెలుగులు

- ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఫరిజల్లిపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఫరిజల్లిపేటలో ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తున్న ఎంపీ సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంటా వెలుగులు వచ్చాయని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. ఫరిజల్లిపేటలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో జరిగిన 'గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాల్లో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పథకాల అమలు తీరు ఎలా ఉంది.. సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం విలేకరులతో చంద్రబోస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడాదిలో ఒక్కో కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ. లక్ష నుంచి రూ. 1.60 లక్షల వరకూ ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇది కాకుండా సొంతింటి కలను సాకారం చేయడం ద్వారా సుమారు రూ. ఆరు లక్షల పైబడి విలువ చేసే ఆస్తిని అందిస్తున్నారన్నారు. ఇంతకంటే పేదలకు ఏం కావాలని, అందుకే జగనన్నను మరోసారి సీఎంని చేయాలని, జక్కంపూడి రాజాను ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలంతా కోరుకుంటున్నారని బోస్ వివరించారు. ప్రజల కోసం ప్రభుత్వం పనిచేస్తుందని, అందుకనే ప్రజలతో మమేకమైన మీ ఎమ్మెల్యే నిరంతరం మీతో ఉంటున్నారని జక్కంపూడి రాజా పనితీరుకు కితాబిచ్చారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ సక్రమంగా ప్రజలకు అందుతున్నాయి కాబట్టే నేడు తాము అంతే ధైర్యంతో ప్రజల ముంగిటకు వస్తున్నామన్నారు. ఈ గ్రామంలో టీడీపీ హయాంలో రూ.47 లక్షలు అభివృద్ధి పనులకు కేటాయిస్తే, తమ ప్రభుత్వంలో గడచిన నాలుగేళ్లలో రూ. 4.13 కోట్లతో అనేక పనులు చేశామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, నాయకులు ఉండమట్ల రాజబాబు, అనదాస సాయిరామ్, అడబాల చినబాబు, వేమగిరి కృష్ణ, నాళం రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యపానంతో అనర్థాలు



పురుషోత్తపట్నం సచివాలయంలో మాట్లాడుతున్న ఎస్సై శుభశేఖర్

సీతానగరం: మద్యం తాగడం వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని, అలాగే కుటుంబ వ్యవస్థ ఆర్థికంగా పతనం అవుతుందని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. గురువారం పురుషోత్తపట్నం సచివాలయంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా వ్యాపారాన్ని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. జూదాలు, కోడి పందేలు, గుండాటలు, సారా విక్రయాలు జరిగితే వెంటనే సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని, పిల్లలతో వెట్టిచాకిరి చేయించరాదన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే సమాచారం అందించాలని ఎస్సై కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు వెలిచేటి మెహర్‌బాబా, శరత్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి గ్రామ శివారున అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై యువి శివనాగబాబు తెలిపిన వివరాల ప్రకారం... వీరలంకపల్లిలో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారనే ఫిర్యాదు మేరకు గురువారం ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో వెదురుపాకకు చెందిన పప్పుల పద్మ అనే మహిళను అదుపులోకి తీసుకుని ఆమె నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మహిళపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించారు.

చలివేంద్రాల ఏర్పాటు

సీతానగరం: ఇనుగంటివారిపేట సచివాలయం వద్ద గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. దాత వరదా గంగాధరం సహకారంతో బాటసారులకు రస్నా అందించారు. అదే విధంగా చినకొండేపూడిలో శ్రీషిర్డీ సాయిబాబా వసతి మందిరం వద్ద చలివేంద్రంలో దాత రుంజాల చినబాబు సహకారంతో మజ్జిగను పంపిణీ చేశారు.

ఉచిత దంత వైద్య శిబిరం

సీతానగరం: స్థానిక కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన ట్రి ఓ డెంట్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు అయ్యల జయభారతి, సీహెచ్ హర్ష, ఎ.సుబ్రహ్మణ్యం, సత్యం రమేష్‌బాబు 62 మందికి దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కస్తూర్బా గాంధీ ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, అయ్యల గోపి, అయ్యల గణేష్, ఎన్.రామకృష్ణ, కొండాటి సత్యనారాయణ, యన్నమని వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్ల పంపిణీ

సీతానగరం: చినకొండేపూడిలో శ్రీషిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో నిరు పేదలకు దాత సహకారంతో భోజనం ప్యాకెట్లు అందించారు. గురువారం దాత, శ్రీరామ కిరాణ నిర్వాహకుడు కొండమీద త్రిమూర్తులు (శివ) ఆర్థిక సహకారంతో 150 మంది పేదలకు భోజనం సమకూర్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మామిడి సత్య సాయిపవన్ (30) మృతి చెందాడు. కోరుకొండ ఎస్సై కట్టా శారదా సతీష్ కథనం ప్రకారం.. గోకవరం మండలం వెదురుపాక గ్రామానికి చెందిన పవన్ మరో యువకుడితో కలసి అతని బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తన ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేసి.. ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టాడు. బైక్ నడుపుతున్న పవన్ రోడ్డుకు ఎడమవైపున పడడంతో లారీ అతని మీద నుంచి ఎక్కేసింది. దీంతో పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.